నేడు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

నల్లకుంట: ఈనెల 18వ తేదీన త్యాగరాజస్వామి 178వ ఆరాధనోత్సవం, సరస్వతీ సంగీత విద్యాలయం 69వ వార్షికోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాస శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలోని ధ్యానమందిరంలో సాయంత్రం 5గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీవీ దర్శక – నిర్మాత శోభా శంకర్, ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతామూర్తి హాజరవుతారని పేర్కొన్నారు. ముందుగా ప్రార్థన గీతం, స్వామివారి అష్టోత్తర పూజ ఉంటుందన్నారు. అనంతరం చిన్నారులతో ఉత్సవ సంప్రదాయ కీర్తనల గానం ఉంటుందని చెప్పారు. ఈ తర్వాత యశస్విని, వాసుకీదేవి, అరుణశ్రీ, విజయ్ కృష్ణ తదితరులు పంచరత్న కీర్తనల గానం చేస్తారన్నారు.

సీసీ రోడ్డుకు ప్యాచ్‌వర్కులు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో అధ్వానంగా మారిన రోడ్లను ఆధునీకరించాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరఖ్‌నాథ్, కె.బాబూరావు డిమాండ్ చేశారు. శుక్రవారం బాపూజీనగర్‌లో సైకిల్ టిక్స్ సమీపంలో జీహెచ్‌ఎంసీ అధికారులు సీసీ రోడ్డుకు ప్యాచ్‌వర్క్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అధ్వానంగా మారిన రోడ్లను ఆధునీకరించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.

అలరించిన అన్నమయ్య పద సుమార్చన

చిక్కడపల్లి: సుమాస్ మ్యాజిక్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం 'అన్నమయ్య పద సుమార్చన' కార్యక్రమం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సిటీ కల్చరల్‌లో నిర్వహించారు. అన్నమయ్య కళాసమితి అధ్యక్షురాలు జి.సుమలత (నకిరేకల్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ప్రముఖ సంగీత గురువు జీవీకే ప్రభాకర్ జ్యోతి ప్రజ్వలన ప్రారంభించారు. చిన్నారులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు అలరించారు. ఈ కార్యక్రమంలో రైటైర్డ్ జడ్జి నేరెళ్ల మాల్యాద్రి, సినీ దర్శకులు బాబ్జీ పాల్గొన్నారు.

అవినీతి పరులు జైలుకు వెళ్లడం ఖాయం

ముషీరాబాద్: అవినీతికి పాల్పడిన నేతలు జైలుకు వెళ్లడం ఖాయమని కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం బీ–బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ ఈ–కార్ రేసులో అవినీతికి పాల్పడినందుకే ప్రభుత్వం విచారణ జరిపిస్తోందని అన్నారు. దానిని కప్పిపుచ్చుకునేందుకే బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కావాలనే సీఎం రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు.

భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా రాజశేఖర్



ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో ఐదు డివిజన్లకు అధ్యక్షులను నియమించిన విషయం తెలిసిందే. భోలక్‌పూర్ డివిజన్‌కు అధ్యక్ష నియామకం వాయిదా పడింది. అయితే ఓబీసీ మోర్చా భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడిగా ఉన్న తనను డివిజన్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కాంతారావు ప్రకటించినట్లు రాజశేఖర్ తెలిపారు. ఈ పదవి అప్పగించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. భోలక్‌పూర్‌లో బీజేపీని మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.

నాన్ టీచింగ్, వర్కర్స్‌కు వేతనాలు పెంచాలి

ముషీరాబాద్: రాష్ట్రంలోని 485 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పని చేస్తున్న సుమారు 6వేల నాన్‌టీచింగ్, వర్కర్స్‌కు వేతనాలు పెంచాలనే డిమాండ్‌పై చెల్లించాలని శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సుకు అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరై తమ సమస్యలపై చర్చించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థలతో సమానంగా జీత భత్యాలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎస్‌ఎల్ పద్మ, పి.అరుణ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు.

ల్యాప్‌టాప్ చోరీ.. వ్యక్తి అరెస్ట్

కాచిగూడ: రైలులో ల్యాప్‌టాప్‌ను దొంగిలించిన వ్యక్తిని కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ ఎస్‌ఎన్ జావీద్, కాచిగూడ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప, ఆర్పీఎఫ్ కాచిగూడ ఇన్‌స్పెక్టర్ గోరఖ్ నాథ్ మల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. కర్ణాటక కొల్లూరు జిల్లా, మలోర్ మండల కేంద్రం గాంధీనగర్‌కు చెందిన నవీన్‌కుమార్ (24) నగర శివారులోని ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. అతను ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. 2024 డిసెంబర్ 21న రైలులో ల్యాప్‌టాప్‌ను దొంగిలించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కేసులు పెడతాం





సుందరయ్య పార్కు చుట్టూ వెలసిన అక్రమ డబ్బాల కూల్చివేత

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రోప్ ఆపరేషన్ పేరుతో జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు లా అండ్ ఆర్డర్ పోలీసులు శుక్రవారం సాయంత్రం సుందరయ్య పార్కు చుట్టూ ఫుట్‌పాత్‌లపై వెలసిన అక్రమ డబ్బాలను కూల్చివేశారు. దీనితో చిరు వ్యాపారులంతా లబోదిబోమంటూ అధికారులను కాళ్లవేళ్ల పడ్డా కనికరించకుండా కూల్చివేతలు పూర్తి చేశారు. సెంట్రల్‌జోన్ అడిషనల్ డీజీపీ ట్రాఫిక్ రాందాస్ తేజావత్, ట్రాఫిక్ ఏసీపీ బి.ఎర్నా, జీహెచ్‌ఎంసీ ఏసీపీ దేవేందర్‌ల ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకు పార్కు పరిసర ప్రాంతాలలో వెలసని అక్రమ డబ్బాలను కూల్చివేశారు. ఆకస్మిక కూల్చివేతలతో చిరు వ్యాపారులంతా దిక్కుతోచని స్థితిలో అయోమయానికి గురయ్యారు.

స్థానికుల ఫిర్యాదు మేరకే కూల్చివేతలు...



స్థానికుల ఫిర్యాదుల మేరకే కూల్చివేతలు ప్రారంభించామని సంబంధిత అధికారులు తెలిపారు. విచ్చలవిడిగా ఫుట్‌పాత్‌లపై డబ్బాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. అంతే కాకుండా పార్కు వచ్చే వారు తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయిందన్నారు.

ముందస్తు నోటీసులు ఇవ్వలేదు...

ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అధికారులు ఆకస్మికంగా వచ్చి తమ డబ్బాలను కూల్చివేశారని చిరు వ్యాపారులు తెలిపారు. తమ వ్యాపారాలను జనావాసాల మధ్య కాకుండా అడవుల్లో పెడితే కొనసాగుతాయా.? అని ప్రశ్నించారు. వేలాది రూపాయలు కిరాయిలు, లక్షలాది రూపాయలు అడ్వాన్స్‌లు చెల్లించలేకనే ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.





మా బతుకులు రోడ్డున పడ్డాయి



అధికారులు చేసిన పని వల్ల మా బతుకులు రోడ్డున పడ్డాయి. మా జీవనోపాధి పోయింది. ఇప్పుడు మేము ఎక్కడికి పోవాలి.? ఏమి చేసి బతకాలి.? కనీసం ముందస్తు సమాచారం లేకుండా మా డబ్బాలను కూల్చివేశారు. కొన్ని డబ్బాలను పూర్తిగా ధ్వంసం చేశారు. కనికరించమని వేడుకున్నా పట్టించుకోలేదు. కొంత సమయం ఇవ్వాలని ప్రధేయపడ్డా కనికరం చూపలేదు.

– నందు, చిరువ్యాపారి

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే సహించం



ఫుల్‌పాత్‌లను ఆక్రమించి డబ్బాలు వేస్తే కేసులు పెడుతాం. ఆక్రమించుకొని డబ్బాలు ఏర్పాటు చేశారు. వారికి ముందస్తు నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదు. స్థానికుల ఫిర్యాదు మేరకే కూల్చివేశాం. ఇకపై ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే సహించమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– రాందాస్ తేజావత్, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



బర్కత్‌పురలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడు రాజ్యాంగాన్ని గౌరవించి, దాని సూత్రాలను పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగం పట్ల గౌరవం చూడం ద్వారా దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజ్యాంగ సూత్రాలను విస్మరిస్తున్నాయని ఆరోపించారు.

ఏడాది పాటు సంవిధాన్ గౌరవ్ అభియాన్..

◆ వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని వక్రీకరిస్తున్నారని ఆయన అన్నారు. ఆయా రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజల నమ్మకాన్ని కోల్పోతున్నాయని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి జనవరి 26తో 75 సంవత్సరాలు పూర్తవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఓ ఏడాది పాటు సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, బంగారు శృతి, కొల్లి మాధవి, ఆనంద్ గౌడ్, శ్యాంసుందర్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, కేశబోయిన శ్రీధర్, కృష్ణాగౌడ్, సందీప్ సాయి తదితరులు పాల్గొన్నారు.

రోహిత్ వేముల ఆశయ సాధనకు కృషి చేయాలి



రోహిత్ వేముల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీబీపీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్

కాచిగూడ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్, దళిత బహుజన విద్యార్థి ఉద్యమ ధృవతార రోహిత్ వేముల చక్రవర్తి 9వ వర్ధంతిని శుక్రవారం నారాయణగూడలోని దళిత బహుజన పార్టీ సెంట్రల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్‌తో పాటు పలువురు పార్టీ నేతలు రోహిత్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... యూనివర్సిటీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దళిత బహుజన జాతుల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రోహిత్ వేముల పోరాటం చేశారన్నారు. మనువాద రాజకీయ మాఫియా, నరేంద్రమోదీ ప్రభుత్వంతో పోరాడే క్రమంలో వారి కుట్రలతో రోహిత్ మరణించారని ఆరోపించారు. తన మరణం ద్వారానైనా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఐక్యతతో పోరాటాలు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని రోహిత్ వేముల ఆశించారని అన్నారు. ఆ వీరుడి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇటికాల గణేష్, ఎం.రవీందర్ ముదిరాజ్, చిప్పరి సుబ్బారావు, నక్కా దేవేందర్ రావు, పి.సుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీజేపీ నేత ఇమ్రాన్ హుస్సేన్ మృతి



ముషీరాబాద్: భోలక్‌పూర్‌కు చెందిన మైనారిటీ మోర్చా మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్ హుస్సేన్(47) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కూతురు ఉన్నారు. అతడు ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌తో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, భోలక్‌పూర్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు అక్లక్‌హుస్సేన్, మున్వర్‌చాంద్, జునేద్‌బాగ్దాదీ, బీజేపీ రాష్ట్ర నాయకులు నందగిరి నర్సింహా, ఆర్.విశ్వం, కార్పొరేటర్ గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్లు అఖిల్, వాజీద్‌హుస్సేన్ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. భోలక్‌పూర్ బడీ మసీద్ సమీపంలో అతడి అంత్యక్రియలు జరిగాయి.

ఉద్యమకారులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

చిక్కడపల్లి: తెలంగాణ ఉద్యమకారులకు రాబోయే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లిలో జరిగిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉద్యమకారులు, అమరుల కుటుంబాలు, కళాకారులకు పింఛన్, 250 గజాల ఇంటి స్థలం, ఆరోగ్య బీమా, గుర్తింపు కార్డులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకాస ప్రధాన కార్యదర్శి ప్రఫుల్ రాంరెడ్డి, వైస్‌చైర్మన్ బత్తుల సోమన్న, గంటి చంద్రుడు, నేతలు పి.యాదగిరి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కిలో గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్టు, బైక్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై జ్యోతి

ముషీరాబాద్: ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్‌టీఎఫ్‌డీ టీమ్ శుక్రవారం దాడులు నిర్వహించాయి. దోమలగూడ ధోబీఘాట్ ప్రాంతంలో బైక్ వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్మకాలు జరుపుతుండగా ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. మౌలాలికి చెందిన కె.యశ్వంత్, రామంతపూర్‌కు చెందిన సీహెచ్ వంశీకృష్ణ వద్ద 1.076 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకొని ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్‌టిఎఫ్ ఎస్సై జ్యోతి తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుల్స్ లేఖసింగ్, ఆలీమ్, కార్తీక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు. గంజాయి పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలహాసన్‌రెడ్డి అభినందించారు.

నేడు హెల్త్ క్యాంప్

ముషీరాబాద్: భోలక్‌పూర్ బడీ మసీద్ వద్ద ఉచిత మల్టీ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నామని ఎస్‌ఆర్‌డీ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, రక్త పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అందరి సహకారంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతం

ముషీరాబాద్: ప్రజలందరి సహకారంతోనే భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయని ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి అన్నారు. స్వామివారి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినందుకు శుక్రవారం స్థానిక నాయకులు తుమ్మరాజు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేష్‌కుమార్, రాజు తదితరులు ఆలయ ప్రాంగణంలో అంజిరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ ఊర్మిళ, రామానందరెడ్డి, అర్జున్‌యాదవ్, సతీష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రెండో రాష్ట్ర మహాసభలు మహబూబాబాద్‌లో ఈనెల 19వ తేదీన జరుగుతున్నట్లు టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం తెలిపారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఆవిష్కరించారు. భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకొని గత కార్యక్రమాలను సమీక్షించుకుంటామని తెలిపారు.

రోడ్లపై మతపరమైన నిర్మాణాలు తీసివేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నగరంలో రోడ్లపైన మతపరమైన నిర్మాణాలను తీసివేయాలని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, తెలంగాణ సిటిజన్స్ రైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరంలో 533 నిర్మాణాలు రోడ్లకు ఆటంకంగా ఉన్నాయని అన్నారు. వీటిని తొలగించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా జీహెచ్‌ఎంసీ కేవలం 26 మాత్రమే తొలగించిందన్నారు. ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ పూర్తిగా విఫలం చెందిందన్నారు.

◆ 114శ్మశానవాటికలు, 357 రోడ్లు ఆక్రమణకు గురయ్యాయని తక్షణమే మతపరమైన నిర్మాణాలపై కమిటీని వేసి విచారణ చేపట్టాలని కోరారు. 2012లో హైకోర్టు ఆదేశించినా నేటికీ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల మూలంగానే ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిరీష్, జి. రాములు, కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు వహీద్, గంజి ఈశ్వర లింగం, సౌమ్య, యాదగిరి రావు, తుమ్మ భాస్కర్, శ్రీమన్నారాయణ, అరుణ, శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ పాఠశాలలో ముగ్గుల పోటీలు



చిక్కడపల్లిలో ముగ్గుల పోటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న బోనం ఊర్మిళ, బోడ నిర్మల

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 19వ తేదీన ఉదయం 9గంటలకు ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షురాలు బోనం ఊర్మిళ తెలిపారు. ముషీరాబాద్ నియోజవర్గంలోని గాంధీనగర్, జవహర్‌నగర్, చిక్కడపల్లిలో ఆమె సంఘం సభ్యులతో కలసి కరపత్రాలను మహిళలకు శుక్రవారం పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోనం ఊర్మిళ మాట్లాడుతూ.. పద్మశాలి కుల సోదరి మణులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈనెల 26న నిర్వహించే చలో ఇందిరా పార్కు పద్మశాలి మేళాకు వేలాదిగా తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మహిళా కార్యదర్శి బోడ నిర్మల, అరుణ శ్రీ, స్వరూప పాల్గొన్నారు.

పార్కులు, గ్రౌండ్‌లను అభివృద్ధి చేస్తాం

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్
- సుందరీకరణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం
- టీఆర్టీకాలనీలో బ్యాడ్మింటన్ కోర్టు ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన
- మణెమ్మ పార్కులో అపరిశుభ్రతపై అధికారులపై ఆగ్రహం



బ్యాడ్మింటన్ కోర్టులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలో పార్కులు, ఆట స్థలాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని టీఆర్టీకాలనీలో ఉన్న బ్యాడ్మింటన్ కోర్టులో రూ.16 లక్షలతో నూతనంగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆట స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులతో ఆట స్థలాలు, అన్ని పార్కుల్లో సుందరీకరణ పనులు చేపట్టామని తెలిపారు.

◆ బ్యాడ్మింటన్ కోర్టు ఆవరణలో చెదలు పట్టి ఓ భారీ వృక్షం ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఉద్యానశాఖ అధికారిని పిలిపించి చెట్టు కొమ్మలు తొలగించాలన్నారు. అవసరమైతే చెట్టును పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో భారీ హైడ్రాలిక్ ల్యాడర్ తెప్పించి చెట్ల కొమ్మలను తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు.

◆ అనంతరం కాలనీలో ఉన్న మణెమ్మ పార్కును సందర్శించారు. పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారం, దుర్గంధాన్ని చూసి ఉద్యానవన అధికారులు, శానిటరీ విభాగం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కును పరిశుభ్రంగా ఉంచాలని వారికి ఆదేశించారు.

◆ అక్కడ నుంచి పాదయాత్ర చేస్తూ వెళ్లిన ఎమ్మెల్యే గణేష్ టెంపుల్ సమీపంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో తొలగించాలని పారిశుద్ధ్య విభాగం అధికారులకు సూచించారు. స్థానికులు ఏకాభిప్రాయానికి వస్తే సదరు స్థలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించి వేరేచోట ఏర్పాటు చేయిస్తానని అన్నారు.

కాలనీ అభివృద్ధికి కలసికట్టుగా పని చేయాలి..

◆ అదే సమయంలో అక్కడికి చేరుకున్న కాలనీకి చెందిన కొందరు ఆలయ సమీపంలో ఉన్న ఓ గదిలో జిమ్ ఉండేదని.. అది కొందరు కబ్జా చేసి పక్కనే ఉన్న గుడి పూజారికి కేటాయించారన్నారు. ఆ గది ఖాళీ చేయించి జిమ్ ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. అదే సమయంలో అక్కడే ఉన్న మరో వర్గం జోక్యం చేసుకుని గతంలో అక్కడ జిమ్ ఉండటం కారణంగా నిత్యం ఆకతాయిలతో సమస్యలు తలెత్తేవని తెలిపారు. ఇరువర్గాల వాదనను విన్న ఎమ్మెల్యే లా అండ్ ఆర్డర్ సమస్యలు ఏమైనా తలెత్తితే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. మీలో మీరు ఘర్షణ పడకుండా కాలనీ అభివృద్ధికి కలసికట్టుగా పాటుపడాలని సూచించారు.

◆ ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, జీహెచ్‌ఎంసీ ఏఈ పృథ్వి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, టీఆర్టీకాలనీ పెద్దలు ఎస్.నర్సింగ్‌రావు, మహేష్‌కుమార్, రాజశేఖర్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు మేడి ప్రసాద్, ఎం.భూపతినాథ్, కూర నరేందర్, భాస్కర్‌గౌడ్, సీహెచ్.సాయి మోహన్, ప్రదీప్‌రావు, విజయేంద్ర సాగర్, వన్నాడి రమ్య, ఎం. మురళి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రౌండ్ వద్ద ఎమ్మెల్యే ఎదుటే వాదించుకుంటున్న కాలనీ ఇరువర్గాల సభ్యులు



మణెమ్మ పార్కులో అపరిశుభ్రతపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు